


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

సోమవారం 01 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 364 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత.. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కు ప్రభుత్వం శ్రీకారం

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 01, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేయనున్న ప్రభుత్వం, ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులను సభ్యులుగా చేర్చనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ట్రస్ట్ సీఈవోగా నియమించనుండగా, పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఆర్థిక శాఖ అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేయగా, మే 31లోపు డేటా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసి, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.




## సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం.. కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల ప్రమాద బీమా

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 01, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి కార్మిక కుటుంబాలకు అమలు చేస్తున్న కోటి రూపాయల ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. సింగరేణి చరిత్రలోనే అతిపెద్ద సంక్షేమ చర్యగా భావిస్తున్న ఈ పథకం ద్వారా గత రెండేళ్లలో 45 కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది. ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.1 కోటి నుంచి రూ.1.25 కోట్ల వరకు బీమా సొమ్ము అందించడంతో పాటు పాక్షిక, శాశ్వత వైకల్యానికి కూడా బీమా వర్తింపజేస్తున్నారు. సహజ మరణాలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నారు. ఇప్పటికే సింగరేణిలో సుమారు రూ.41 కోట్ల బీమా సొమ్ము చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వ చొరవపై కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కారుణ్య నియామకంతో ఉద్యోగంలో చేరిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంతోష్ కుటుంబానికి, అలాగే ప్రమాదంలో మరణించిన రంజిత్ కుమార్ కుటుంబానికి ఈ పథకం ద్వారా కోటి రూపాయల ఆర్థిక సాయం అందడం వారి కుటుంబాలకు అండగా నిలిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుల చొరవతో 2024లో ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇతర ప్రభుత్వ సంస్థలకు కూడా ఆదర్శంగా మారింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తదితర బ్యాంకులు సింగరేణితో ఒప్పందాలు చేసుకుని ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా అమలు చేస్తున్నాయి. అదనంగా నామమాత్రపు ప్రీమియంతో రూ.50 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని కూడా ప్రవేశపెట్టడం విశేషం. పొరుగు సేవల సిబ్బందికి రూ.40 లక్షల వరకు ప్రమాద బీమా, విశ్రాంత ఉద్యోగులకు కూడా ఉచిత బీమా వర్తింపజేస్తుండటంతో సింగరేణి కార్మికుల్లో భరోసా పెరిగిందని అధికారులు తెలిపారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. ఆర్‌బీఐ పరిశీలన




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 01, ప్రతినిధి: దేశంలో ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ నోట్ల ప్రవేశంపై భారతీయ రిజర్వు బ్యాంకు పరిశీలన కొనసాగిస్తోంది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ మన్నికగా ఉండటంతో పాటు తడిసినా, మడతపడినా సులభంగా దెబ్బతినవని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే నకిలీ నోట్ల నియంత్రణకు ఉపయోగపడే అత్యాధునిక భద్రతా ఫీచర్లను ఈ నోట్లలో పొందుపరచే అవకాశముంది. ఎక్కువకాలం వినియోగంలో ఉండటంతో పదేపదే కొత్త నోట్లు ముద్రించాల్సిన అవసరం తగ్గి ముద్రణ వ్యయం కూడా ఆదా కానుందని అధికారులు భావిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కరెన్సీ నిర్వహణ ప్రణాళికల్లో భాగంగా ప్లాస్టిక్ నోట్ల ప్రవేశంపై ఆర్‌బీఐ అంతర్గతంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు, ప్రజల వినియోగ తీరుపై నిపుణులతో పరిశీలనలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రారంభ దశలో ప్రజల్లో ఎక్కువగా చలామణి అయ్యే రూ.10, రూ.20, రూ.50 నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే అవకాశముండగా, ఈ ప్రయోగం విజయవంతమైతే తర్వాత దశల్లో రూ.200, రూ.500 నోట్లను కూడా ప్లాస్టిక్ కరెన్సీ రూపంలో తీసుకురావచ్చని సమాచారం. అయితే దీనిపై భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

## శిశువు చేతి తొలగింపు ఘటనపై సుమోటో కేసు నమోదు చేసిన టీజీహెచ్ఆర్‌సీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 01, ప్రతినిధి: ఖమ్మం ప్రభుత్వ మాతా-శిశు సంక్షేమ కేంద్రంలో చికిత్స పొందిన అకాల ప్రసవ శిశువుకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎడమ చేయి భుజం వరకు తొలగించాల్సి వచ్చిందన్న ఆరోపణలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్పందించింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో "నెలలు తక్కువని వస్తే.. వికలాంగుడిగా మార్చారు!" శీర్షికతో ప్రచురితమైన వార్తను టీజీహెచ్ఆర్‌సీ గౌరవ సభ్యురాలు (న్యాయ) శ్రీమతి శివాడి ప్రవీణ సుమోటోగా స్వీకరించారు. వార్తలో పేర్కొన్న ఆరోపణలు నిజమైతే అవి నవజాత శిశువు జీవించే హక్కు, ఆరోగ్య హక్కు, గౌరవప్రదమైన జీవన హక్కుతో పాటు తగిన వైద్య సేవలు పొందే హక్కులకు సంబంధించిన అత్యంత తీవ్రమైన అంశాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిని కమిషన్ ఆదేశించింది. ఈ కేసును జూన్ 29 ఉదయం 11 గంటలకు విచారణకు నిర్ణయించినట్లు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ప్రజా సంబంధాల అధికారి తెలిపారు.

## ప్రభుత్వ రంగంలో తొలి అత్యాధునిక క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రం ప్రారంభించిన నిమ్స్



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 01, ప్రతినిధి: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో అత్యాధునిక క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సాంకేతికత ఆధారంగా క్యాన్సర్‌కు సంబంధించిన డీఎన్ఏ, ఆర్ఎన్ఏ మార్పులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా గుర్తించే ఈ కేంద్రం ద్వారా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో కీలక పురోగతి సాధ్యమవుతుందని వైద్యులు తెలిపారు. తెలంగాణలో ప్రభుత్వ రంగంలో ఎన్‌జీఎస్ ఆధారిత క్యాన్సర్ నిర్ధారణ సేవలను అందిస్తున్న తొలి ఆసుపత్రిగా నిమ్స్ నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ – ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలోని డైమాండ్స్ పథకం కింద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 25 కేంద్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక కేంద్రం నిమ్స్ అని డైరెక్టర్ డాక్టర్ ఎన్. భీరప్ప తెలిపారు. ఈ కేంద్రంలో ఎన్‌జీఎస్, పీసీఆర్, డిజిటల్ డ్రాప్లెట్ పీసీఆర్, ఫిష్, ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీతో పాటు ఇతర ఆధునిక మాలిక్యులర్ డయాగ్నస్టిక్ పరీక్షలను అర్హులైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు 1,443 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందగా, వీరిలో 784 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులు, 659 మంది రొమ్ము క్యాన్సర్ రోగులు ఉన్నట్లు పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్యాన్సర్ నిర్దిష్ట ఎన్‌జీఎస్ పరీక్షలతో పాటు సాధారణ రక్తపరీక్ష ద్వారా క్యాన్సర్‌ను గుర్తించే లిక్విడ్ బయాప్సీ పరీక్షలను కూడా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల క్యాన్సర్ రోగులకు ఆధునిక నిర్ధారణ సేవలు, మెరుగైన చికిత్స అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని వైద్యులు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 01, ప్రతినిధి: స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేయగా, 13 నెలల్లో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యిందని, మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికానున్నాయని తెలిపారు. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కొఠారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడతకు శ్రీకారం చుడతామని వెల్లడించారు. కొత్తగూడలో సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ప్రతి నియోజకవర్గానికి 5,500 నుంచి 6,500 ఇళ్ల వరకు మంజూరు చేసినట్లు అవుతుందని తెలిపారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1,500 ఇళ్ల వరకు మంజూరు చేసినట్లు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే అందిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. గతంలో ఇందిరమ్మ, గృహలక్ష్మి పథకాల కింద మంజూరై ఇంకా పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలకు కూడా రెండో విడతలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామంలో శ్రీమతి దూదేకుల రైహిమా బేగం జంగీర్ గార్ల నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, సర్పంచ్ గోపాల్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో కీలకమైందని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలారి సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, సంజీవ్ రెడ్డి, రఘురాం రెడ్డి, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, బేతయ్య, శ్రీను, వార్డ్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సందేశం టైమ్స్, ఆందోల్ మండల ప్రతినిధి, జూన్ 01: ఆందోల్ మండల పరిధిలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గడి పెద్దాపూర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న మహిళ రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, మృతురాలి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ట్రిపుల్ ఐటీకి సంగారెడ్డి జిల్లా నుంచి 312 మంది ఎంపిక



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, ప్రతినిధి: ఈ విద్యా సంవత్సరానికి నిర్వహించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో సంగారెడ్డి జిల్లా నుంచి 312 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఒక్క సంగారెడ్డి జిల్లా నుంచే ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను జిల్లా విద్యాధికారి ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ విజయం జిల్లా విద్యావ్యవస్థకు గర్వకారణమన్నారు. విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం కూడా ఈ విజయానికి కారణమని ఆయన తెలిపారు.

# టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు నల్లపోచమ్మ ఆలయంలో ఘన స్వాగతం



సందేశం టైమ్స్, మనూర్, జూన్ 01, నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంచార్జి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలోని బోరంచ గ్రామంలో మంజీరా నది తీరాన వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని ప్రముఖ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు ఆమెకు ఘన స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నైనా జైస్వాల్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. క్రీడారంగంలో ఆమె సాధించిన విశిష్ట విజయాలను కొనియాడుతూ ఆలయ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందూర్ కృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రీడాకారిణి నైనా జైస్వాల్ బోరంచ గ్రామంలోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించడం గ్రామ ప్రజలకు ఆనందాన్ని కలిగించిందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి ఎర్రోళ్ల ప్రవీణ్




సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని పెద్దముభరకపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఎర్రోళ్ల ప్రవీణ్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ప్రతిభ చాటాడు. జిల్లా పరిషత్ హైస్కూల్ సిర్గాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ప్రవీణ్ ఈ ఘనత సాధించడం పట్ల గ్రామ ప్రజలు, యువకులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రవీణ్ తండ్రి ఎర్రోళ్ల సాయిలు, తాత బిచ్చమయ్యతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఇతర విద్యార్థులకు ప్రవీణ్ ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

# సింగూర్ బ్యాక్‌వాటర్‌పై హై లెవెల్ వంతెన పనులను పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ







సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 01: అందోల్ నియోజకవర్గ పరిధిలోని మునిపల్లి మండలం గార్లపల్లి గ్రామం వద్ద సింగూర్ బ్యాక్‌వాటర్‌పై నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన పనులను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. రూ.17.70 కోట్ల నిధులతో కొనసాగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక వంతెన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి, పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకుండా పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ హై లెవెల్ వంతెన నిర్మాణం పూర్తయితే గార్లపల్లి గ్రామం నుంచి మండల కేంద్రానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, స్థానిక ప్రజల రాకపోకలు సులభతరం అవడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాండీలతో చేపల వేటపై చర్యలు తీసుకోవాలి: పాలడుగు మత్స్యకారుల వినతి



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, జూన్ 01, క్రైమ్ రిపోర్టర్ నాగరాజు: వట్పల్లి మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో చెరువులు, జలాశయాల్లో అక్రమంగా పాండీలు ఏర్పాటు చేసి చేపల వేట కొనసాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నీటి మట్టం తగ్గిన పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు చిన్న చేపలు, గుడ్డు దశలో ఉన్న చేపలను కూడా విచక్షణారహితంగా పట్టుకుంటున్నారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మత్స్య సంపద నశించే ప్రమాదం ఏర్పడటమే కాకుండా మత్స్యకార కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కొంతమంది దళారులు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పాండీలు ఏర్పాటు చేసి చేపలు పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సైను కోరారు. “చిన్న చేపలను, గుడ్డు దశలో ఉన్న చేపలను నేడు కాపాడితేనే రేపటి మత్స్య సంపద నిలుస్తుంది” అని మత్స్యకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలడుగు గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి.. ఐదుగురు జూదరుల అరెస్ట్



సందేశం టైమ్స్, న్యాల్కల్, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని మల్గి గ్రామ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై హద్నూర్ ఎస్ఐ సుజిత్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం మెరుపు దాడి నిర్వహించి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మల్గి గ్రామ శివారులో గోవిందు భూమిలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న వారిపై ఆకస్మికంగా దాడి చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 52 పేకాట ముక్కలు, రూ.2,000 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుజిత్ మాట్లాడుతూ పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# రామ్‌నగర్ 22వ వార్డులో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి పట్టణంలోని 22వ వార్డు రామ్‌నగర్‌లో గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రామ్‌మందిర్‌లోని ఆమె స్వగృహంలో స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమంలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలను అందజేస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన చీరలను ప్రజలు ఇతర అవసరాలకు ఉపయోగించుకున్న పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, వార్డు పెద్దలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమానికి హాజరైన మాద్రి పృథ్వీరాజ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ మరియు సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ఉమ్మడి సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు సత్యనారాయణతో పాటు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో పటాన్‌చెరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో యువతకు పెద్దపీట వేస్తున్నామని, యువత పెద్ద ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి కార్యకర్త డిజిటల్ సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాబోయే బల్దియా ఎన్నికల్లో పటాన్‌చెరు పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ నల్లపోచమ్మ ఆలయ దర్శనం




సందేశం టైమ్స్, మనూర్, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలోని బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందిన నైనా జైస్వాల్‌కు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. నైనా జైస్వాల్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి సతీమణి అనుపమ రెడ్డి కూడా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శివ రుద్రప్ప, బోరంచ గ్రామ సర్పంచ్ బీరప్ప, మనూర్ మండల ఎస్సై కోటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సమాజ వాస్తవాలను ప్రతిబింబించే ‘బతుకుదెరువు’ షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



సందేశం టైమ్స్, జహీరాబాద్, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో సమాజంలోని వాస్తవ పరిస్థితులు, సామాన్య ప్రజల జీవన పోరాటాలను ప్రతిబింబించే లక్ష్యంతో శ్రీహాస్ ఫిల్మ్స్ ప్రొడక్షన్ హౌస్ ఆధ్వర్యంలో రూపొందుతున్న ‘బతుకుదెరువు’ షార్ట్ ఫిల్మ్ పూజా కార్యక్రమం సిద్ధేశ్వరాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చిత్రానికి తొలి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత, సినిమాటోగ్రాఫర్ చంద్రశేఖర్ గిద్దలమారి మాట్లాడుతూ సమాజానికి సందేశాత్మకంగా ఉండేలా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్శకుడు కులకర్ణి విష్ణుకాంత్, నటీనటులు శంకర్, ఉమారాణి, నరేష్, నర్సింలు, అసిస్టెంట్ డీఓపీ ప్రభాకర్, కాశీనాథం, జై, పోలీస్ ప్రవీణ్ పాటిల్, కే. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ పూజారి సంగమేశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు.

## సదాశివపేట బీజేపీకి వేణుమాధవ్ రాజీనామా



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 01, 2026: భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ రాష్ట్ర నాయకులు నెమలికొండ వేణుమాధవ్ ఆదివారం తన పదవికి, అలాగే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గత పది సంవత్సరాలుగా ఆయన రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా చురుకైన పాత్ర పోషించగా, ముషీరాబాద్, కామారెడ్డి నియోజకవర్గాల ఇన్చార్జిగా కూడా సేవలందించారు. తన రాజీనామా అనంతరం వేణుమాధవ్ మాట్లాడుతూ, తన రాజకీయ భవిష్యత్తు మరియు తదుపరి కార్యాచరణను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తానని మీడియాకు తెలిపారు.

## రూ.15 లక్షల విలువైన 30 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలో ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీల్లో రూ.15 లక్షల విలువ గల 30 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు నారాయణఖేడ్–వాసర్ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా షేరీ తాండాకు చెందిన చావాన్ ప్రభు, మున్యా నాయక్ తాండాకు చెందిన రాథోడ్ పర్లాల్ బీదర్ నుంచి నారాయణఖేడ్ వైపు అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 30 కిలోల ఎండు గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను తదుపరి విచారణ నిమిత్తం నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి అంతర్జాతీయ మార్కెట్ విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్సైలు అనుదీప్, హన్మంతు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సందేశం టైమ్స్ రిపోర్టర్ రమేష్‌బాబు కుమార్తె ఆరాధ్య జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01: సందేశం టైమ్స్ రిపోర్టర్ బేగరి రమేష్‌బాబు కుమార్తె ఆరాధ్య మూడవ జన్మదిన వేడుకలు అమ్మమ్మ ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధ్య తన తల్లిదండ్రులు రమేష్‌బాబు, సుమలత, అన్న జీవన్ సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఆనందంగా జరుపుకుంది. అమ్మమ్మ రత్నమ్మ, తాత భూమయ్య, పెద్ద మామ సాయిలు, పెద్ద అత్తమ్మ బాలమణి, చిన్న మామ హన్మంత్, చిన్న అత్తమ్మ అనిత, అమ్ములు, చరణ్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఆరాధ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరాధ్యకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని అందరూ ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ సుడిగాలి పర్యటన.. ₹42 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 01, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో విస్తృతంగా పర్యటించి విద్య, టూరిజం, రహదారులు, వంతెనల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదిత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు రూ.42 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధేరలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రూ.6.80 కోట్లతో నిర్మించనున్న నూతన అకడమిక్ బ్లాక్, లింగంపల్లిలో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో రూ.11 కోట్లతో ప్రతిపాదించిన అకడమిక్ బ్లాక్ నిర్మాణ స్థలాలను పరిశీలించారు. అలాగే కంకోల్ టోల్ గేట్ వద్ద తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో నిర్మించనున్న హరిత హోటల్, కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన స్థలాన్ని సందర్శించారు. గార్లపల్లి–తక్కడపల్లి హై లెవెల్ బ్రిడ్జి, సింగూరు బ్యాక్‌వాటర్ గ్రామాలను కలిపే రోడ్డు, వంతెన నిర్మాణ పనులతో పాటు పలు ప్రధాన రహదారుల పురోగతిని సమీక్షించారు. ఈ పర్యటనలో సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, ఇంజినీరింగ్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

# నూతన బైక్ షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




సందేశం టైమ్స్, పటాన్‌చెరు, జూన్ 01, ప్రతినిధి బి. డేవిడ్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బ్లాక్ ఆఫీస్ కార్యాలయం ఎదురుగా శ్రీనివాస్ ఏర్పాటు చేసిన నూతన ఆటో వరల్డ్ బైక్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్ రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆటోమొబైల్ వ్యాపారం అభివృద్ధి చెంది మరింతగా వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, పాటి సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, గుండమొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా.. మంజీరా నదిలో మునిగి యువకుడు మృతి




సందేశం టైమ్స్, పుల్కల్, జూన్ 01, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచారం గ్రామ శివారులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి సరదాగా మంజీరా నదికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానిక ఎస్సై విశ్వజన్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోచారం గ్రామానికి చెందిన సాయిలు (24) ఆదివారం ఉదయం తన కుమారుడు సుశాంత్‌తో పాటు మరికొందరు స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని మంజీరా నది వద్దకు వెళ్లాడు. వారిలో చాలామందికి ఈత రాకపోవడంతో ఒడ్డునే ఉండగా, సాయిలు మాత్రం నదిలోకి దిగాడు. అయితే సాయిలుకు కూడా సరిగా ఈత రాకపోవడంతో నదిలో లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతడిని రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే సాయిలు మృతి చెందినట్లు తెలిపారు. తన భర్తకు ఈత రాకపోవడం వల్లే ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య శోభ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆకస్మిక మరణంతో పోచారం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.

## గౌరవ ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన.. ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్ పర్యవేక్షణ



సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 01, ప్రతినిధి: తుని మండలం చామవరం గ్రామంలో జూన్ 1, 2026న ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్, ఐపీఎస్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వీఐపీ కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించి రూట్ మ్యాప్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. సభా వేదిక, ట్రాఫిక్ పాయింట్లు, కట్ ఆఫ్ పాయింట్లు, హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సివిల్ పోలీస్, ఆర్మ్డ్ రిజర్వ్, స్పెషల్ టీమ్స్, క్రైమ్ పార్టీ, ట్రాఫిక్ పోలీసులు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, క్విక్ రెస్పాన్స్ టీమ్ తదితర విభాగాలు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. పర్యటన ముగిసే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, ఏఎస్పీ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్, ఇతర జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి: ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగూరు నారాయణ

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 01, ప్రతినిధి: కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మరియు కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగూరు నారాయణ కీలక దిశానిర్దేశం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసంలో జిల్లా స్థాయి టీడీపీ నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ, ప్రతి లబ్ధిదారుడికి చేరేలా నాయకులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న పార్టీ కమిటీల ద్వారా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పార్టీని, కూటమి ప్రభుత్వాన్ని తిరుగులేని శక్తిగా నిలపాలన్నారు. అలాగే సోమవారం తునిలో జరగనున్న ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమం, పర్యటన ఏర్పాట్లపై జిల్లా నాయకులతో ప్రత్యేకంగా చర్చించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కేడర్ మధ్య నిరంతర అనుబంధం కొనసాగేందుకు ఇలాంటి ఆత్మీయ విందు సమావేశాలను ఇకపై ప్రతి నెల నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, సీనియర్ నాయకులు నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లి అనంతలక్ష్మి, రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం.. రైతుల ఖాతాల్లో రూ.512.87 కోట్లు జమ.. ప్రజావాణి దరఖాస్తులు హెల్ప్‌డెస్క్ ద్వారా స్వీకరణ: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 01, ప్రతినిధి: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 65,116 మంది రైతుల నుంచి 3,11,238.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 47,463 మంది రైతులకు రూ.512.87 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మొత్తం 40 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ, తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హమాలీల సంఖ్యను పెంచి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు.అదే విధంగా రేపు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు హెల్ప్‌డెస్క్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 02 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో జిల్లా, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల అధికారులు విధుల్లో నిమగ్నమై ఉండటంతో ప్రజావాణికి ప్రత్యక్షంగా అందుబాటులో ఉండరని ఆమె తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

## జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ వేడుకలు: మెదక్ జిల్లాలో జెండా ఆవిష్కరణకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరు



సందేశం టైమ్స్, మెదక్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జూన్ 2న మెదక్ జిల్లాలో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గారు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతుండగా, జిల్లాలో జరిగే ప్రధాన వేడుకకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులుగా ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఇదే సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు, చెల్లింపులు, రవాణా ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాల మేరకు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించాలని, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 65,116 మంది రైతుల నుండి 3,11,238.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 47,463 మంది రైతుల ఖాతాల్లో రూ.512.87 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే 40 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయినట్లు వెల్లడించారు. మరోవైపు ప్రజావాణి కార్యక్రమాన్ని జూన్ 2 ఆవిర్భావ వేడుకల కారణంగా హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండరని, ప్రజలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## బాసర ఐఐఐటీకి పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్ విద్యార్థుల ఎంపిక.. పాఠశాలలో హర్షం




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా ప్రతినిధి, జూన్ 1: అల్లాదుర్గం మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు బాసర ఐఐఐటీ ప్రవేశాలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఎంపికైన విద్యార్థుల్లో నేహా, నందు, దుర్గప్రసాద్, భువనేశ్వరి, సాయికుమార్, నవప్రసన్న, అంజయ్య ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్ విద్యార్థులను అభినందిస్తూ వారి కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ బృందం కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొంది. విద్యార్థుల ప్రతిభపై అధికారులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## బీజేపీ జిల్లా శిక్షణ మహా అభియాన్ 2026 ముగింపు.. పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం



సందేశం టైమ్స్, మెదక్ ప్రతినిధి, జూన్ 1: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా శిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమం ఈరోజు ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. శనివారం ప్రారంభమైన ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముగింపు సభలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సి. అంజి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంత భూమిక, బీజేపీ చరిత్ర వికాసం, కార్య విస్తరణలో మన ఆలోచన, భావజాల పరిరక్షణ, కార్యకర్త వికాసం మరియు బాధ్యతలు, దేశం ఎదుర్కొంటున్న రాజకీయ-సామాజిక సవాళ్లు, మోడీ ప్రభుత్వ పేదల సంక్షేమ పథకాల అమలు, చివరి వ్యక్తికి అభివృద్ధి చేరవేయడం, సోషల్ మీడియా ప్రాముఖ్యత, ఆధునిక సాంకేతిక వినియోగం, మీడియా నిర్వహణ, బూత్ స్థాయి నిర్వహణ, మన్ కీ బాత్, SIR, GIT వంటి మొత్తం 12 అంశాలపై రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన 12 మంది వక్తలు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మీనారాయణ, జిల్లా శిక్షణ ప్రభారి కట్ట సుధాకర్ రెడ్డి, బసవరాజు, జిల్లా ఇన్‌చార్జి బొక్క నరసింహారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సంఘసాని సురేష్, శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే పంజా విజయ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, కొండల్ రావు, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ భూచేష్ యాదవ్, సీనియర్ నాయకులు పబ్బ సత్యం, మహిళా మోర్చా నాయకులు కవిత రెడ్డి, చంద్రకళ, అనంత లక్ష్మి, జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ పనులపై కలెక్టర్ ఆగ్రహం.. సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం



సందేశం టైమ్స్, సూర్యాపేట, జూన్ 1: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు మరియు కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిని పరిశీలించారు. కేఎస్ఆర్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న పనుల్లో జాప్యం, రోడ్లను తవ్వి నెలల తరబడి పునరుద్ధరణ చేయకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్లు, మ్యాన్‌హోల్స్ నిర్మాణం పూర్తైన వెంటనే తవ్విన గోతులను పూడ్చకపోవడం నిర్లక్ష్యమని పేర్కొంటూ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లు, ఇతర మౌలిక వసతులను వెంటనే పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అధికారులను హెచ్చరించిన ఆయన, పనుల్లో వేగం పెంచాలని, రోడ్డు వారీగా టైమ్‌లైన్‌తో కూడిన సమగ్ర యాక్షన్ ప్లాన్ వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ, కాంట్రాక్ట్ ఏజెన్సీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల ఇబ్బందులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థం జరిగిన రోజుల్లోనే విషాదం.. రోడ్డు ప్రమాదంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని మృతి





సందేశం టైమ్స్, మెదక్ జిల్లా ప్రతినిధి, జూన్ 1: అందోల్ నియోజకవర్గంలోని ఆక్సన్ పల్లి గ్రామ శివారులో NH-161 రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అల్లాదుర్గం మండలం మాందాపురం గ్రామానికి చెందిన పాముల కావేరి (22) మృతి చెందింది. ఇటీవలే సారంపల్లికి చెందిన సాయిలుతో ఆమెకు నిశ్చితార్థం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పరీక్షల కోసం హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా, వనపర్తి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు కావేరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, బైక్ నడుపుతున్న సాయిలుకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనతో ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ఈసెట్ విజయం – రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి కళాశాలకు గర్వకారణం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 1: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంగారెడ్డి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం విద్యార్థులు టీజీ ఈసెట్-2026లో రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పరీక్షలో ఈసీఈ విభాగానికి చెందిన పుట్టి విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంక్, ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ 34 సాధించగా, నక్కా సుశ్విత్ 130వ రాష్ట్ర ర్యాంక్, 315 ఇంటిగ్రేటెడ్ ర్యాంక్, దోసవారి రోహిత్ 189వ రాష్ట్ర ర్యాంక్, 519 ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జానకి దేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన బోధన, అధ్యాపకుల నిరంతర శ్రమతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్. విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కోచింగ్, అదనపు తరగతులు, మాక్ టెస్టులు, సందేహ నివృత్తి తరగతులు నిర్వహించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అధ్యాపక బృందం ఆర్.కె. విద్యాసాగర్, టి. మంజుల, బి. గోపాల్ రావు, జి. సదానందం, ఉమాశంకర్ తదితరుల కృషిని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ విజయానికి అధ్యాపకుల మార్గదర్శకత్వం, ప్రోత్సాహమే ప్రధాన కారణమని పేర్కొంటూ కళాశాలకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విజయాన్ని హర్షిస్తూ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.